సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంఆర్ఓ కార్యాలయం, ఈడబ్ల్యూఎస్ రోడ్, పోస్ట్ ఆఫీస్, దోబీఘాట్, ఎల్ఐజీ, శివాలయం రోడ్, మహారాష్ట్ర బ్యాంక్, 4వ రోడ్ ఎదురు, ఆర్ఆర్ చికెన్ సెంటర్ రోడ్, ఎల్ఐజీ 302, ధనలక్ష్మి సెంటర్ ప్రాంతాల్లో అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రావెల్స్ రోడ్డు, ధర్మారెడ్డి ఫీడర్‌ల పరిధిలోని మంజీరా మాల్ నుంచి యూనివర్సిటీ గేటు, రెయిన్‌ట్రీ హాస్పటల్, వీఆర్ సిలక్స్, బజాజ్ షోరూం, రెమెడి ఆసుపత్రి 4వ రోడ్డు, ఎంఆర్ షాపింగ్, చందనా బ్రదర్స్ వీధి, బాటా షోరూం, ఎంఆర్ఓ కార్యాలయం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ధర్మారెడ్డి పార్కు ప్రాంతం, ఐసీఐసీఐ బ్యాంక్, పూజా ఎలక్ట్రికల్ షాపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అయ్యప్ప సొసైటీ ఫీడర్ పరిధిలో..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ అయ్యప్ప సొసైటీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ కె.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు హరిహర ఆలయం ఎదురుగా, పర్వత్‌నగర్, తులసినగర్, జేపీ నగర్‌లలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గాయత్రినగర్, జేకే పాయింట్, ఎస్‌డీ ఫంక్షన్‌హాల్, రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజులోని జంగిల్ థీమ్ పార్కు పనులు, బాలాజీనగర్ ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న ఓపెన్ జిమ్ పార్కు కాంపౌండ్‌వాల్, బాలాజీనగర్ ఎంఐజీ 186 పార్కు కాంపౌండ్ వాల్, ప్రగతినగర్ నుంచి సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు, పవర్‌నగర్ పార్కు డెవలప్‌మెంట్ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఫిరోజ్‌గూడలో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడలో శుక్రవారం ఆధ్వర్యంలో నూతన ట్రాన్స్‌పార్మర్లు మార్పిడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మౌనిక, ఇంజినీర్ రమేష్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, లైన్‌మెన్ రామారావు, నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, మొహమ్మద్ ఖాజా, పంజా రాంచందర్ ముదిరాజ్, దేవులపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



కూకట్‌పల్లి: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ ఒలింపియాడ్ లెవల్-2 పరీక్షలో వివేకానందనగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. ప్రిన్సిపాల్ సూర్యకళ మాట్లాడుతూ.. మొత్తం 77 మంది పరీక్షలో పాల్గొంటే 22 మందికి మెరిట్ సర్టిఫికెట్‌లు, 55 మందికి పతకాలు, రూ.19వేల బహుమతి గెలుచుకున్నారని పేర్కొన్నారు. ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, జోనల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, డీన్ శ్రీహరి, ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఫిర్యాదుతో వీధి దీపాలకు మరమ్మలు



ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో వివిధ ప్రాంతాలలో వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన శుక్రవారం విద్యుత్ అధికారులతో మాట్లాడి వైశ్యబ్యాంక్ కాలనీ, సాయిక్రిష్ణ కాలనీ, మల్లికార్జున నగర్ రోడ్డు నంబర్ 4, గంగపుత్ర, పీవీ ఎన్‌క్లేవ్, సమతానగర్‌లోని వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

సమస్యలతో ఉక్కిరిబిక్కిరి!

- ఇబ్బందులు పడుతున్న భరత్‌నగర్ కాలనీవాసులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మూసాపేట: పచ్చని చెట్లతో... ఆధ్యాత్మిక శోభతో... అలరారే ఆ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రశాంతతకు నెలవైన ఆ కాలనీలో అనేక సమస్యలు ప్రజలను నిత్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 1978లో ఎంఐజీ 15, ఈడబ్ల్యూఎస్ 24, ఎల్ఐజీ 222 ఇళ్లలతో అతి తక్కువ జనాభాతో పచ్చని వనంలా ఉన్న కాలనీ, ప్రస్తుతం ఎల్ఐజీ 616, ఈడబ్ల్యూఎస్ 999, ఎంఐజీ 177, హెచ్ఐజీ 101, ప్రైవేటు ఇళ్లు 130లతో సుమారు నలభై వేలకు పైగా గల జనాభా ఉన్న కాలనీ భరత్‌నగర్ కాలనీ, డ్రైనేజీ రోడ్లు, పార్కులు, మంచినీరు, యూ టర్న్ వంటి పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భరత్‌నగర్‌కాలనీలో పాడైపోయిన ఇంటి మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

- బీఎస్ఎన్ఎల్ తమ ఉద్యోగుల వసతి కోసం 60 గృహాలను ఈ కాలనీలో కొనుగోలు చేసింది. కొన్ని రోజులు ఉద్యోగులు ఉన్నప్పటికి పదవీ విరమణ పొందిన తర్వాత, ఇళ్లు పాతబడిపోవడంతో ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో ఈ 60 ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.
- రాత్రి సమయంలో ఇళ్లు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- అంతే కాకుండా చెత్తాచెదారంతో డస్ట్‌బిన్ కేంద్రంగా మారాయి. చెత్త పేరుకుపోయి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- కాలనీకి వచ్చే ప్రధాన రహదారి పెద్ద సమస్యగా మారింది. ప్రజలు కాలనీలోకి వెళ్లే దారికి పోలీసు అధికారులు నో యూటర్న్ బోర్డు తగిలించి అటుగా వెళ్లే వాహనాల ఫోటోలు తీసి ఈ చలాన్ విధిస్తున్నారు.
- కాలనీకి ఇదే ప్రధాన రహదారి కావడంతో భరత్‌నగర్ బ్రిడ్జీపై నుంచి వచ్చేటప్పుడు యూటర్న్ తీసుకొని కాలనీలోకి వెళ్లాలి. కానీ పోలీస్ అధికారుల చలాన్లో స్థానిక ప్రజలు కాలనీ నుంచి బయటకు వెళ్లాలి అన్నా.. లోపలకు రావాలన్నా.. భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కాలనీ ప్రధాన రహదారిలోనే పండ్లు, పూలు అమ్ముకునే చిరు వ్యాపారస్తుల వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. కాలనీలోని పలు అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. అభివృద్ధి పేరిట తవ్వి నెలలు గడుస్తున్నా మళ్లీ రోడ్డు వేయడం మరిచిపోయారు. సీనియర్ సిటిజన్ పార్కు చుట్టూ రోడ్డు అధ్వానంగా ఉంది.
- పార్కుల్లో సరైన పచ్చదనం లేక వాకింగ్ ట్రాక్ లేకపోవంతో కాలనీ ప్రజలు పార్కులను ఉపయోగించుకోలేక పోతున్నారు.
- కాలనీలోని ఓపెన్‌నాలాలు మూసి అండర్ గ్రౌండ్ పైపులు వేశారు. దీంతో వర్షాకాలంలో రోడ్డుపైనే నీరు నిలిచే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆ స్థలంలో చిరువ్యాపారులకు షెడ్డులకు అనుమతి ఇస్తున్నారు. దీంతో వర్షం నీరు వెళ్లలేక పోవడమే కాక ట్రాఫిక్‌కు, పాదాచారులకు ఇబ్బంది పడే అవకాశం ఉంది. శని, ఆది వారాల్లో టిఫిన్‌సెంటర్లు, మాంసం షెడ్డులతో స్థానికులు, పాదాచారులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు.



ప్రమాదకరంగా మారిన భరత్‌నగర్‌కాలనీ నుంచి కాలనీలోకి వెళ్లే యూ టర్న్



భరత్‌నగర్ కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు



చెత్తాచెదారంతో శివసేన గ్రౌండ్

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పార్కుల పనులకు సంబంధించిన నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని ఎట్టి పరిస్థితుల్లో జాప్యం జరగొద్దని సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 95శాతం పనులు పూర్తి చేశామని పెండింగ్‌లో ఉన్న పనులు కూడా త్వరలో పూర్తి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రంలో వైద్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో శుక్రవారం కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 18 కంటి వెలుగు కేంద్రాల్లో 1170 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 185 మందికి కళ్లద్దాలు అందజేశారు. 230 మందిని చికిత్సలకు రీఫర్ చేశారు.

కూకట్‌పల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీషలతో కలిసి కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి వెలుగు కేంద్రంలో పని చేస్తున్న వైద్యులను సన్మానించారు.

ఫతేనగర్ డివిజన్‌లో..

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని భగత్‌సింగ్ పార్కులో కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కంటి వెలుగు సెంటర్‌ను స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సౌకర్యాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రజలందరికీ కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. 150 మంది బస్తీవాసులు కంటి పరీక్షలకు హాజరయ్యారని.. 145 మందికి కళ్లజోళ్లు అందించామని తెలిపారు. 5 మందికి ఆపరేషన్‌లు చేయించుకోవాలని సూచించామని తెలిపారు.



పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భరోసా



ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులను అందజేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కులాంతర వివాహం చేసుకున్న వారికి (ఐదుగురు దంపతులు) శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులను అందజేశారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భరోసా కల్పించడం చాలా సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతినగర్, ఆంజనేయనగర్ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు.

అమోర్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి అమోర్ ఆస్పత్రిలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. నాల్గో అంతస్తులోని ఓ గదిలో షాట్‌సర్క్యూట్ జరగడంతో వెంటనే ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం చోటు చేసుకోకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ ఆకస్మిక మృతి

- సంతాపం తెలిపిన స్థానికులు, ప్రజాప్రతినిధులు



కూకట్‌పల్లి: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన హెడ్ కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ అకాల మరణం పట్ల కూకట్‌పల్లి ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నివాసముంటూ సమీప ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌లలో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నాడు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు శ్రీమన్నారాయణ సుపరిచితుడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి సాయ పడుతూ.. అందరితో కలివిడిగా ఉండే ఆయన మృతి చెందిన విషయం తెలియగానే స్థానికంగా పరిచయస్తులు, పోలీస్ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసుపత్రి వద్దకు వచ్చి నివాళులర్పించారు. హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.





శ్రీమన్నారాయణ మృతదేహం వద్ద నివాళులు అర్పించి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జేఎన్‌టీయూహెచ్ నుంచి ప్రగతినగర్ మెయిన్‌రోడ్ మీద హైటెన్షన్ కేబుల్ పనుల కోసం తవ్విన రోడ్డు ప్యాచ్‌వర్కు పనులను శుక్రవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐకియా సబ్‌స్టేషన్ నుంచి ప్రగతినగర్ మెయిన్‌రోడ్డులోని హైటెన్షన్ పవర్‌లైన్ కేబుల్ పనుల కోసం తవ్విన రోడ్డు ప్యాచ్‌వర్కు పనులను పరిశీలించామన్నారు. ప్యాచ్‌వర్కు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్యాచ్‌వర్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఫైర్‌సేఫ్టీ మాక్‌డ్రిల్

జీడిమెట్ల: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఫైర్‌సేఫ్టీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏదైనా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే మంటలను ఎలా ఆర్పాలన్న దానిపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ అధికారి సుభాష్‌రెడ్డి తగు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ఎల్లప్పుడు అగ్ని ప్రమాద నివారణ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

నన్ను కాల్చేయ్.. లెగుస్తా.!

ఓవైపు పచ్చదనం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుంటే.. మరోవైపు కొంతమంది నిర్లక్ష్యంతో ఆహ్లాదాన్ని పంచే వృక్షాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయని అనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ నుంచి ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డులో శుక్రవారం చెట్టు మొదట్లో చెత్తను తగలబెట్టారు. ఎవరైనా స్థానికుల, పారిశుద్ధ్య కార్మికులా ఈ చెత్తను తగలబెట్టింది తెలియ రాలేదు. – సుభాష్‌నగర్



పుట్టిన రోజే అనంత లోకాలకు..

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



హర్షిత (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: పుట్టిన రోజే ఓ విద్యార్థిని మృత్యు ఒడికి చేరుకుంది... ఏమైందో ఏమో కానీ జన్మదినం రోజే బలవన్మరణం పొంది కన్నవారికి కడుపు కోత మిగిల్చింది. అప్పటి వరకు తోటి విద్యార్థినులతో ఆనందంగా గడిపిన ఆ యువతి పుట్టిన రోజే తిరిగిరాని లోకాలకు వెళ్లటం అందరినీ కలిచివేసింది. సీఏ చదువుతున్న విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది.

- ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి చామపాడు గ్రామానికి చెందిన కేసాని కిరణ్‌కుమార్ బాలాజీనగర్‌లో నివాసముంటూ ఓ ప్లాస్టిక్ కంపెనీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఒక్కగానొక్క కూతురు హర్షిత (20) అలియాస్ హనీ. ఆన్‌లైన్‌లో సీఏ, బీకాం చదువుతోంది. సాయికిరణ్ బంధువులు చనిపోవటంతో సాయికిరణ్, భార్య నర్మదాలు బుధవారం సాయంత్రం నెల్లూరుకు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు.
- గడియ కొట్టడంతో ఎంతకీ తలుపు తీయకపోవటంతో అనుమానం వచ్చి ఇంటి యజమాని మూర్తి సహాయంతో గడియ పగలగొట్టి బెడ్ రూంలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. దీంతో వెంటనే చున్నీ కట్ చేసి కూతురుని కిందకు దించాడు. తనకు ఒక్కగానొక్క కూతురు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించటంతో ఆ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరయ్యారు. అంతకు ముందు రోజు గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి వస్తున్నారా? అని అడిగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
- పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులతో కలిసి సినిమా చూడడానికి కూడా వెళ్లినట్లు తలిదండ్రులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొని క్లూస్ టీమ్ ఆధారంగా వివరాలు సేకరించారు. తన కూతురు చదువులో ఒత్తిడికి లోనయ్యేదని.. ఆ కారణంతోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని తండ్రి సాయికిరణ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్‌లో రూ.5300కోట్ల
స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు

- వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం డిమాండ్

కూకట్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ పిలుపు మేరకు బీజేవైఎం నాయకులు అరుణ్‌కుమార్, కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

- రాష్ట్రంలో దాదాపు 18 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.5300 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. స్వరాష్ట్ర సాధనలో విద్యార్థి త్యాగాలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు సతమతమవుతున్నారని మండిపడ్డారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇప్పించలేని అసమర్థ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
- ఉన్నత చదువుకు వెళ్లే విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదని వాపోయారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయి, జిల్లా నాయకులు పృథ్వీ, తిరుపతిరెడ్డి, హరి, కన్వీనర్లు రామకృష్ణ, సాయి, శ్రీపతి, రాహుల్, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూహెచ్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు